బీమా.. ఏదీ ధీమా?

- నెలలు గడుస్తున్నా బాబు ష్యూరిటీకి లభించని గ్యారెంటీ
- అమలుకు నోచుకోని చంద్రన్న బీమా
- కనీసం దరఖాస్తులు కూడా స్వీకరించని వైనం
- అధికారంలోకి వచ్చి 11నెలలు గడుస్తున్నా తెరుచుకోని వెబ్‌సైట్

ఎమ్మిగనూరుటౌన్: ఎన్నికల ముందు ప్రజలకు హామీలిచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11నెలలు గడుస్తున్నా వాటి అమలును మాత్రం పట్టించుకోవడంలేదు. కనీసం కుటుంబాల్లో చనిపోయిన వారికి ఇస్తామన్న చంద్రన్న బీమా పథకాన్ని సైతం అమలు చేయడంలోనూ పూర్తిగా వైఫల్యం చెందుతోంది .దీంతో కుంటుబపెద్దను కోల్పోయిన పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి.

గత ప్రభుత్వంలో 15 రోజుల్లో పరిహారం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పేద,బడుగు బలహీన వర్గాలకు చెందిన కుటుంబాల్లో 18 నుంచి 50 సంవత్సరాల్లోపు వారు ఎవరైనా సహజంగా మృతిచెందితే రూ.లక్ష, ప్రమాదవ శాత్తు మృతిచెందితే రూ.5లక్షల చొప్పున వైఎస్సార్ బీమా మంజూరయ్యేది. మృతి చెందిన వెంటనే వలంటీర్లు, గ్రామ సచివాల సిబ్బంది మృతుడి ఇంటికి వెళ్లి తక్షణ సహాయంగా రూ.10వేలు అందించేవారు. మిగిలిన సొమ్మును 15రోజుల్లో బాధిత కుటుంబ సభ్యుల బ్యాంక్ ఖాతాకు జమ చేసేవారు. ఈ బీమా సొమ్ముకై ప్రభుత్వమే బీమా ప్రీమియం కట్టేది. తద్వారా కులం, మతం, పార్టీలు చూడకుండా ప్రతి పేద కుటుంబానికి సత్వర సహాయం అందేది.


బాధిత కుటుంబానికి బీమా పరిహారం అందిస్తున్న కౌన్సిలర్ శివప్రసాద్ (ఫైల్)

ఎమ్మిగనూరులో 214 కుటుంబాలకు పరిహారం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మిగనూరు పట్టణంలో 2019 నుంచి 2023వ సంవత్సరం వరకు 214 మంది మృతి చెందగా వారి కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం కింద రూ.3,09,69,999లు మంజూరు అయ్యాయి. అదేవిధంగా గోనెగండ్ల మండలంలో 177 మంది మృతి చెందగా వారికి రూ. 2,83,44, 999లు మంజూరు అయ్యాయి. ఆ తరువాత గద్దెనెక్కి న కూటమి ప్రభుత్వం పథకం పేరు మార్చినా ఒక్క పైసా కూడా విదిల్చలేకపోయింది.

పేరుమార్పుతో సరి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ బీమా పథకం పేరును చంద్రన్న బీమాగా మార్చి దాని అమలును మాత్రం గాలికి వదిలేశారు. సహజమరణానికి రూ.5లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాలకు రూ.10లక్షలు అందిస్తామని ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కేందుకు ప్రగల్భాలు పలికింది. అయితే గద్దె నెక్కి నెలలు గడుస్తున్నా బాధిత కుటుంబాలకు బీమా సొమ్ము మాత్రం అందలేదు.

ప్రారంభంకాని వెబ్‌సైట్

2024 మే తరువాత కూటమి ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకం వెబ్‌సైట్‌ను తొలగించింది. ఆ తర్వాత కొత్తగా పేరుపెట్టిన చంద్రన్న బీమా వెబ్ సైట్‌ను మాత్రం ప్రారంభించ లేదు. బీమా నమోదు చేయలేదు. మృతి చెందిన వారి నుంచి క్లైములను స్వీకరించేందుకు మార్గదర్శకాలను ఇవ్వలేదు. బీమాపై దరఖాస్తులు స్వీకరించేందుకు నేటికి ఎలాంటి ఆదేశాలు లేవని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పేర్కొంటున్నారు. దీంతో కుటుంబ యజమానులను, కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధితులు బీమా సొమ్ము కోసం ఎదురు చూస్తున్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



కూటమి ప్రభుత్వం చంద్రన్న బీమా పథకాన్ని వెంటనే అమలు చేయాలి. సహజంగాను, ప్రమాదవశాత్తు మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ఇస్తామన్న బీమా సొమ్మును సత్వరం మంజూరు చేసి ఆయా కుటుంబాలను ఆదుకోవాలి.

– రంగన్న, సీపీఐ పట్టణ కార్యదర్శి, ఎమ్మిగనూరు

బీమా మంజూరు చేయాలి



బడుగు బలహీన వర్గాల కుటుంబాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు చంద్రన్న బీమా కింద మంజూరు చేస్తామన్న బీమా సొమ్మును ప్రభుత్వం మంజూరు చేయాలి. బీమా సొమ్ము కోసం బాధిత కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. వారిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బాధిత కుటుంబాలకు బీమా సొమ్ము ఇంటికి వెళ్లి అందించేవారు.

– కామర్తి నాగేషప్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు, ఎమ్మిగనూరు

15 నుంచి ప్రజానాట్యమండలి శిక్షణ తరగతులు

ఆదోని రూరల్: ఈనెల 15, 16, 17వ తేదీల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా స్థాయి శిక్షణ తరగతులను స్థానిక విశ్వనారాయణ జూనియర్ కళాశాలలో జరుగుతాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ శిక్షణా తరగతులకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట కార్యదర్శివర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు హర్షత్, గంగన్న, కరెంట్ ఈరన్న, మెకానిక్ వలి తదితరులు పాల్గొన్నారు.

వైపీఆర్ కాలనీలో నీటి ఎద్దడి

ఆదోని అర్బన్: పట్టణశివారులోని ఆస్పరి రోడ్డులో ఉన్న వైపీఆర్ కాలనీలో గత 12 రోజులగా నీటి సమస్య తీవ్రంగా ఉంది. తాగడానికి నీరు లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ పరిధిలోని ఉన్న లైన్‌మెన్‌కు పలుమార్లు విన్నవించినా నీటి పైపులైన్‌కు మరమ్మతులు చేపడుతున్నామని కాలయాపన చేస్తున్నారన్నారు. 12 రోజుల నుంచి పైపులకు మరమ్మతులు ఎలా చేస్తారని, లైన్‌మెన్ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నాడన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తమ కాలనీలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

క్లుప్తంగా

షాపుల యజమానులకు నోటీసులు


రైల్వేస్టేషన్ రోడ్డులో ఓ షాపునకు నోటీసు అతికిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆదోని టౌన్: మున్సిపాలిటీలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 25 ఏళ్ల కాలపరిమితి ముగిసిన 35 దుకాణాలకు సంబంధించిన యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం .కృష్ణ తెలిపారు. అందుబాటులో లేని షాపుల యజమానుల దుకాణాలకు నోటీసులను అతికించినట్లు చెప్పారు. 35 షాపులకు త్వరలోనే బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగా ఉన్న పాటదారులు వేలం పాటల్లో పాల్గొని షాపులను దక్కించుకోవచ్చన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్


పట్టుబడిన మద్యం బాక్సులు, బైకు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

ఆదోని రూరల్: మండలంలోని బసలదొడ్డి గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి పెద్ద తుంబళం గ్రామానికి కర్ణాటక మద్యం సరఫరా చేస్తూ పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ ఎస్.కె.జె.సైదుల్ బుధవారం తెలిపారు. సదరు వ్యక్తి వద్ద నుంచి 8 కర్ణాటక మద్యం బాక్సులు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు


ఎమ్మిగనూరుటౌన్: ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మిక, ఉద్యోగ వర్గాలతో పాటు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజినేయులు, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగమణి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎన్జీఓ భవనంలో కార్మిక, ఉద్యోగ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను అమల్లోకి తెచ్చిందన్నారు. వాటిని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సత్యన్న, గోవిందు, రాముడు, బాల రాజు, తిమ్మగురుడు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం చేరిన నోట్ పుస్తకాలు


పుస్తకాలు పరిశీలిస్తున్న ఎంఈఓ శోభారాణి

కౌతాళం: మండంలోని విద్యార్థుల కోసం నోట్ పుస్తుకాలు వచ్చినట్లు ఎంఈఓ–2 శోభారాణి తెలిపారు. మొదటి విడత కింద మండలానికి 74,886 నోట్ పుస్తకాలు వచ్చాయన్నారు. ఇందులో వైట్ నోట్ 35,095, సింగల్ రూల్ బుక్స్‌లు 33,323, బ్రాడ్ రూల్ బుక్స్ 7,345, గ్రాఫ్స్ 4,120 ఉన్నాయని చెప్పారు. అలాగే బెల్ట్‌లు 10,321 వచ్చాయన్నారు. ఇప్పటికే టెస్ట్ బుక్స్‌లు వచ్చినట్లు తెలిపారు. వీటిని పాఠశాలల వారీగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంకా యూనిఫాంలు, షూ రావాల్సి ఉందన్నారు.

నాటుసారా స్వాధీనం


సారా బట్టీని ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఆదోని రూరల్: మండలంలోని ఇస్వీ గ్రామ శివారులో జమ్మూ ఈరన్న పొలంలో అక్రమంగా నాటుసారా కాస్తుండగా దాడులు చేసినట్లు ఇస్వీ ఎస్ఐ డాక్టర్ నాయక్ బుధవారం తెలిపారు. 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఆదోని పట్టణం బాలాజీపేటకు చెందిన బోయ శివను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ఘనంగా గురుదత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ఠాపన



తులాభారంలో మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, నూతన మందిరానికి పూజలు

ఆదోని అర్బన్: పట్టణంలోని సదాశివపేటలో వెలిసిన గురుదత్తాత్రేయ స్వామి నూతన మందిరం, విగ్రహ ప్రతిష్ఠాపన, కుంభాభిషేక మహోత్సవం బుధవారం గురుదత్తాత్రేయ స్వామి భజన మంది రం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో మంత్రాలయం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థుల శ్రీపాదులవారు పాల్గొని గురుదత్తాత్రేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, గోపురశిఖర కలశ ప్రతిష్ఠాపన, కుంభాభిషేకం కార్యక్రమాలు చేపట్టారు. ఆలయకమిటీ సభ్యులు నవధాన్యాలతో మంత్రాలయం పీఠాధిపతికి తులాభారం చేశారు. ముందుగా ఆలయంలో గణపతి హోమం, కళాహోమం, పీఠ పూజ తదితర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.


గురుదత్తాత్రేయస్వామి విగ్రహం

తాగునీటి సమస్య పరిష్కరించాలి


ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని రూరల్: మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం వద్దకు చేరుకుంది. కార్యాలయం ఎదుట సీపీఎం బృందం ధర్నా చేపట్టింది. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశులు, సీపీఎం పార్టీ మండల కార్యదర్శి లింగన్న మాట్లాడుతూ మండలంలోని చాలా గ్రామాలకు పదిహేను రోజులుగా తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారన్నారు. పాలకులు, అధికారులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. మూడు రోజులపాటు పలు గ్రామాల్లో పాదయాత్ర చేపట్టగా ఆయా గ్రామాల ప్రజలు నీటి సమస్యలను తమకు వివరించారన్నారు. అధికారులు స్పందించి వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజకు అందజేశారు. ఈఈ మాట్లాడుతూ మండలంలో నెలకొన్న తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి వాటర్ గ్రిడ్ మంజూరయ్యిందన్నారు. త్వరలోనే అన్ని గ్రామాలకు పుష్కలంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయలు, అయ్యప్ప, నాయకులు మునిస్వామి, రామాంజనేయులు, అయ్యన్న, తిక్కప్ప, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం ఏపీఓ సస్పెన్షన్

కౌతాళం: మండలంలో ఉపాధి పనులు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో ఏపీఓ బజారిని డ్వామా పీడీ వెంకటరమణయ్య సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ విజయశేఖరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ బుధవారం జిల్లా పీడీ మండలంలో ఉపాధి పనులను పరిశీలించేందుకు మండలానికి రాగా ఏపీఓ విధులకు హాజరుకాకుండా ఎలాంటి సమాచారం లేకుండా డుమ్మా కొట్టడంతో పాటు ఉపాధి కార్మికులకు పనులు అడిగితే కల్పించకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీంతో ఏపీఓను సస్పెండ్ చేసినట్లు చెప్పారు.


బదినేహాల్‌లో డ్రాగన్ పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఉపాధి పనుల పరిశీలన

డ్వామా పీడీ మండలంలోని బదినేహాల్ గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించి కార్మికులతో మాట్లాడారు. అలాగే గ్రామంలో ఉద్యాన పంటలను ప్రోత్సహించడంలో భాగంగా డ్రాగన్ పంటను పరిశీలించారు. ఈసీ మహమ్మద్‌రఫీక్, సిబ్బంది ఉన్నారు.

ప్రశాంత జీవనం అలవర్చుకోవాలి

కౌతాళం: ప్రజలు ప్రశాంత జీవనానికి అలవాటు పడాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. మండలంలో ఫ్యాక్షన్ పికెట్లను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా మండల పరిధిలోని నదిచాగి, రౌడూరు పికెట్లను పరిశీలించి అక్కడి రికార్డులను తనిఖీ చేశారు. గ్రామాల్లో ఫ్యాక్షన్ నిర్మూలనకు తీసుకోవలసిన చర్యలపై గురించి కౌతాళం సీఐ అశోక్‌కుమార్‌తో చర్చించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామని గ్రామాల్లో ఎవరైన అసాంఘీక కార్యాకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైన సరే ఉపేక్షించేది లేదన్నారు. ఫ్యాక్షన్ జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం అంతర్ రాష్ట్ర సరిహద్దు బాపురం చెక్‌పోస్టును తనిఖీ చేశారు.


నదిచాగిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

నేలకొరిగిన చెట్లు, స్తంభాలు


వర్షానికి విరిగిన విద్యుత్ స్తంభం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని వెంకటగిరి గ్రామంలో బుధవారం సాయంత్రం ఈదురు గాలులు, భారీ వర్షానికి చెట్లు నేలకొరగగా, విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. బుధవారం అకస్మాత్తుగా భారీ వర్షం రావడంతో గ్రామంలోని చెరువులు, కాలువలు నీరు ఎక్కి పారాయి. గాలుల దాటికి చెట్లు నేలకొరగగా, విద్యుత్ స్తంభం విరిగిపోవటంతో విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేశారు. గ్రామంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అయితే పొలం పనులకు ఈ వర్షం బాగా ఉపయోగం పడుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


వర్షానికి నేలకొరిగిన చెట్టు

బంగారు వ్యాపారులపై కేసు నమోదు

ఆదోని అర్బన్: పట్టణంలోని షరాఫ్‌బజార్‌లో ఇద్దరు బంగారు వ్యాపారులపై త్రీటౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం బళ్లారి పట్టణానికి చెందిన ఫిరోజ్‌బేగం గత నెల 18న షరాఫ్‌బజార్‌లోని బంగారు వ్యాపారులు ఖాదర్‌బాషా, సాదిక్‌బాషాకు 5.4 తులాల బంగారాన్ని కరిగించి కొత్త ఆభరణం చేయాలని ఇచ్చింది. అలాగే 15.8గ్రాములు, 1.96 గ్రాముల ఉంగరం, చంపచారును పాలీష్ చేసేందుకు ఇచ్చింది. కొన్ని రోజుల తర్వాత వారిద్దరికి ఫోన్ చేసినా స్పందించలేదు. ఇక్కడ వచ్చి చూడగా వారి ఆచూకీ లేదు. దీంతో ఆమె త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు బంగారు వ్యాపారులు సాదిక్‌బాషా, ఖాదర్‌బాషాలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గురుకుల కళాశాలకు ఎంపిక

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఎస్ఎస్ఎస్ జెడ్పీ హైస్కూల్ పాఠశాలకు చెందిన హేమంత్ కుమార్ ఏపీఆర్‌జేసీ గురుకుల కళాశాలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం శోభ బుధవారం తెలిపారు. ఈసందర్బంగా విద్యార్థిని ఆమెతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కమిటీ రోడ్డు, ట్యాంక్ బండ్ రోడ్డు, షరాఫ్ బజార్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. ఆయా పనుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందికి సూచించారు. పట్టణ ప్రజలు పారిశుద్ధ్య కార్మికులకు సహరించాలని కోరారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో అల్పాహార పంపిణీని పరిశీలించారు.

16న నెట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 16వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక బి.క్యాంపు సిల్వర్ జూబ్లీ కళాశాల మైదానంలో ఉమ్మడి జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా నెట్‌బాల్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కె.నాగరత్నమయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2009 జనవరి తరువాత జన్మించిన క్రీడాకారులందరూ ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని ప్రకటించారు. సబ్ జూనియర్ బాల బాలికల విభాగంలో నిర్వహిస్తున్న ఈ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఈ నెల 18వ తేదీన కర్నూలులోని స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. రాష్ట్ర స్థాయిలో రాణించిన క్రీడాకారులు ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు ఇండోర్‌లో నిర్వహించనున్న సబ్ జూనియర్ నెట్‌బాల్ జాతీయ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు వయో ధ్రువీకరణ పత్రంతో నేరుగా హాజరు కావాలని సూచించారు. వివరాలకు 93938 55460 సెల్ నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి కన్నీటి వీడ్కోలు


ఉసేని మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, మురళీ మోహన్‌రెడ్డి


ఉసేని పిల్లలను ఓదార్చుతున్న ఎమ్మెల్యే

కోసిగి: మండలంలోని చిన్నభూంపల్లి గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు కౌతాళం పెద్ద ఉసేని(42) కూటమి నాయకుల ఒత్తిళ్లకు మానసిక వేదనతో బాధపడుతూ గుండెపోటుకు గురై మంగళవారం మృతి చెందిన విషయం విధితమే. బుధవారం గ్రామ ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. ఉదయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి గ్రామానికి చేరుకుని ఉసేని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉసేని మృతి చెందడం పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే అన్నారు. మృతిని కుటుంబ సభ్యులు, పిల్లలను ఓదార్చుతూ భావోద్వేగానికి లోనయ్యారు. ఉసేనికి ముగ్గురు మగ పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వారు చిన్న పిల్లలు కావడంతో బాగా చదువుకోవాలని మనోధైర్యాన్ని ఇచ్చారు. ఉన్నత చదువులకు అయ్యే ఖర్చు కూడా భరిస్తానని హామీ ఇచ్చారు. ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని భరోసా కల్పించారు. ప్రస్తుతం అంత్యక్రియల నిమిత్తం రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్ సీపీ మండల నాయకులు నాడుగేని నాగరాజు, బసిరెడ్డి, దొడ్డి నరసన్న, నాడుగేని వీరారెడ్డి , మాన్వి వెంకటేష్, గట్టు భీమయ్య, వడ్డే ఉలిగయ్య, తుంబిగనూరు ఈరన్న, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సన్మానం

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణకు గ్రేడ్–2 నుంచి గ్రేడ్–1 కమిషనర్‌గా పదోన్నతి లభించడంతో మున్సిపల్ ఉద్యోగులు బుధవారం ఆయనను సన్మానించారు. కమిషనర్ చాంబర్‌లో ఆయనకు పూలమాలలు, శాలువాలు వేసి సత్కరించారు. హిందూపురం మున్సిపాలిటీలో గ్రేడ్–2 కమిషనర్‌గా పనిచేసిన ఎం.కృష్ణ పదోన్నతిపై ఆదోనికి గ్రేడ్–1 మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతిపై వచ్చారు. అయితే ఆయన బదిలీపై వచ్చినప్పటికీ పదోన్నతి ఉత్తర్వులు అందలేదు. దీంతో ఆయన ఆరేడు నెలలుగా గ్రేడ్–2 కమిషనర్‌గానే విధులు నిర్వర్తించారు. సోమవారం పదోన్నతి ఉత్తర్వులు రావడంతో గ్రేడ్–1 మున్సిపల్ కమిషనర్‌గా ఆదోనిలోనే విధులు చేపట్టారు. దీంతో మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానం చేశారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

ఆదోని టౌన్: ఆదోని పట్టణంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ఎం .కృష్ణ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలకు సూచించారు. బుధవారం కమిషనర్ చాంబర్‌లో శానిటరీ సెక్షన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 19న మహాయోగి లక్ష్మమ్మవ్వ జాతర సందర్భంగా పట్టణంలో ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివస్తారని, ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. భక్తులకు అనుగుణంగా ఏర్పాట్లను సమీక్షిస్తున్నామన్నారు. దాతలు అన్నదానం, తాగునీటి వసతి, మజ్జిగ, శీతల పానీయాలు తదితర వాటిని ఉచితంగా పంపిణీ చేస్తారని, వారికి అవసరమైన ఏర్పాట్లు కూడా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.


కమిషనర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

రైతులు మెలకువలు పాటించాలి


శాస్త్రవేత్తలకు ప్రాజెక్టు వర్కు వివరిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

గోనెగండ్ల : తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి రైతులు మెలకువలను పాటించాలని శ్రీకృష్ణ దేవరాయ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ సూచించారు. బుధవారం మండలంలోని వేముగోడు గ్రామంలో కర్నూలు ఏరువాక కేంద్రం, శ్రీకృష్ణ దేవరాయ వ్యవసాయ కళాశాల విద్యార్థులు సంయుక్తంగా రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. వారు మాట్లాడుతూ వరిలో యాజమాన్య పద్ధతుల గురించి, నూతన వంగడాల ఎంపిక గురించి రైతులకు వివరించారు. ఇందులో ఎన్‌డీఎల్ఆర్–7, ఆర్ఎన్ఆర్–152048, మారుతేరు వరి రకాల గురించి, ఎరువుల యాజమాన్యం పురుగు తెగుళ్ల యాజమాన్య పద్ధతులను వివరించారు. వ్యవసాయ విద్యార్థులు చివరి సంవత్సరం ప్రాజెక్టు వర్కులో భాగంగా మూడునెలలు పాటు వేముగోడు గ్రామంలో ఉంటూ రైతు పొలాలను సందర్శించి వారి సమస్యలను తెలుసుకొని క్షేత్రస్థాయిలో అవగాహన పెంపొందించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ రవి కిషోర్, ఏఓ హేమలత, అధ్యపకులు సోమ సుందర్, సుస్మిత, జాకీర్, రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

పెద్దకడబూరు : వేసవి సెలవుల్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కె.ప్రకాష్ సూచించారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఆశాజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని బుధవారం ఆయన అకస్మిక తనిఖీ చేశారు. పిల్లలు, పాఠకులతో గ్రంథాలయాన్ని ఎలా ఉపయోగించుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు వేసవి కాలంలో తమ పిల్లలను ఎండలకు బయటకు పంపించకుండా గ్రంథాలయాలలో నిర్వహించే వేసవి శిబిరాలకు పంపించాలని సూచించారు.

వేసవి తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి పునశ్చరణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాష్ సూచించారు. బుధవారం పట్టణంలోని గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులతో పాటు విద్యార్థుల వేసవి పునశ్చరణ తరగతులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కె.ప్రకాష్